క్లుప్తంగా

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా శ్రీనివాసులు

కణేకల్లు: కణేకల్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా శ్రీనివాసులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక తహసీల్దార్ రజాక్‌వలీ నెలరోజుల పాటు సెలవు పెట్టడంతో బొమ్మనహాళ్ తహసీల్దార్‌కు కలెక్టర్ గౌతమి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

గురుకుల పాఠశాలలో ఆర్‌ఓ ప్లాంట్


ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

ఉరవకొండ: స్థానిక శివరామిరెడ్డి కాలనీలోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 500లీటర్ల సామర్థ్యం ఉన్న ఆర్‌ఓ ప్లాంట్‌ను శనివారం సాహితీ గగన్‌మహల్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది జె.ప్రతాప్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సునీత ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో నెలకొన్న తాగునీటి సమస్యను న్యాయవాది దృష్టికి తీసుకొచ్చిన వెంటనే స్పందించారన్నారు. ముంబాయిలోని సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఎండీ మఠం వెంకటరావు దృష్టికి సమస్యను తీసుకెళ్లి.. వారి సహకారంతో రూ.1.50 లక్షల వ్యయంతో ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటుతో పాటు 15 వాటర్ క్యాన్లను అందించారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినిలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న వైద్య బృందం


ఉరవకొండ: ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారులు సూచించారు. మండలంలోని ఆమిద్యాల గ్రామంలో ఆరునెలల చిన్నారి యోగనందకు డెంగీ పాజిటివ్ నిర్ధారణ కావడంతో శనివారం గ్రామంలో అధికారులు, వైద్యులు పర్యటించారు. తహసీల్దార్ హరిప్రసాద్, రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పావని, ఈఓఆర్‌డీ చంద్రమౌళి, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కోదండరామిరెడ్డి, సీహెచ్‌ఓ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ, సెక్రటరీ మహేష్ ప్రతి ఇంటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామంలో ఫాగింగ్ చేయించి, అపరిశుభ్రత ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

చెత్తరహిత పట్టణానికి సహకరించాలి


కార్మికులకు చీపుర్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శిల్ప

రాయదుర్గంటౌన్: చెత్తరహిత పట్టణం కోసం ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప సూచించారు. తడి, పొడి, హానికరమైన చెత్తలను వేర్వేరు బుట్టల్లో వేసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. శనివారం పాత మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు పెద్ద చీపుర్లను పంపిణీ చేశారు. స్వచ్ఛ రాయదుర్గం నిర్మాణం ప్రజల సహకారంతోనే సాధ్యపడుతుందన్నారు. చెత్తా చెదారాన్ని కాల్వల్లో పారవేయకుండా మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు శ్రీనివాసులు, వార్డు ఇన్‌చార్జులు పొరాళ్ల శివకుమార్, శ్రీరామిరెడ్డి, గోల్డ్ ఇస్మాయిల్, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ జగదీష్, మేస్త్రీలు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యంపై ఉక్కుపాదం


పట్టుబడిన మద్యం, ద్విచక్ర వాహనం చూపుతున్న సెబ్ సీఐ జయనాథ్‌రెడ్డి

రాయదుర్గం: కర్ణాటక మద్యం రవాణాపై సెబ్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. రాయదుర్గం సెబ్, అనంతపురం స్పెషల్ టీం పోలీసులు శనివారం సంయుక్తంగా జరిపిన దాడుల్లో గుమ్మఘట్ట మండలం గొల్లపల్లి వద్ద పట్టణానికి చెందిన సోమశేఖర్, వడ్డే లోకేష్ పట్టుబడ్డారు. వారి వద్ద 596 కర్ణాటక టెట్రా ప్యాకెట్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్టు సెబ్ సీఐ జయనాథ్‌రెడ్డి తెలిపారు. నిందితులపై కేసులు నమోదు చేశామన్నారు. కాగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కర్ణాటక మద్యం విక్రయించినా, రవాణా చేసినా కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. రెండు లేదా ఆపై పట్టుబడిన వారిపై పీడీ యాక్టు తెరుస్తామన్నారు. కార్యక్రమంలో స్పెషల్ టీమ్ సీఐ నాగేంద్రప్రసాద్, ఎస్‌ఐ హరికృష్ణ, హెడ్‌కానిస్టేబుల్ సోమశేఖర్, సిబ్బంది శివయ్య, ఇమ్రాన్, తిమ్మన్న, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రైతు సంక్షేమం


కణేకల్లు మండలం ఎన్.హనుమాపురంలో రైతులకు సబ్సిడీ పప్పుశనగ పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి


ఉరవకొండ మండలం రాకెట్ల ఆర్‌బీకే వద్ద పప్పుశనగ పంపిణీని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి
- రైతులకు సబ్సిడీ పప్పుశనగ పంపిణీ

కణేకల్లు: మాది రైతు పక్షపాతి ప్రభుత్వం.... రైతులకు ఏ కష్టమొచ్చినా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచి ఆదుకుంటున్నారని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. 40శాతం సబ్సిడీతో అందజేస్తున్న సబ్సిడీ పప్పుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని విప్ కాపు రామచంద్రారెడ్డి శనివారం కణేకల్లు మండలంలోని ఎన్.హనుమాపురంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఆయన రైతులనుద్దేశించి మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వం చేయనంత సాయం రైతులకు తమ సర్కారు చేస్తోందన్నారు. ఓ వైపు సబ్సిడీపై వేరుశనగ, పప్పుశనగ, కంది విత్తనాలను అందిస్తూ మరో వైపు రైతులు పండించిన పంటలను కనీస మద్దతు ధరతో కొనుగోలు చేసి ఆదుకుంటున్నామన్నారు. కస్టమ్ హైరింగ్ సెంటర్ల ద్వారా రైతులకు సబ్సిడీ వ్యవసాయ పరికరాలను అందజేశామన్నారు. అలాగే రైతులకు సున్నా వడ్డీతో పంట రుణాలివ్వడంతో పాటు అతివృష్టి, అనావృష్టితో పంటలు నష్టపోయిన రైతులకు బీమా, పరిహారం పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లాకు 24,266 క్వింటాళ్ల పప్పుశనగ విత్తనాలను కేటాయించామన్నారు. ఇప్పటి వరకూ జిల్లావ్యాప్తంగా 12,883 మంది రైతులు 18,463 క్వింటాళ్ల పప్పుశనగ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. అర్హులందరికీ పప్పుశనగ పంపిణీ చేస్తామని, రైతులు ఆందోళన చెందొద్దని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్, ఏఓ శ్రవణ్‌కుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్‌డీ గూడెన్న, పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి, కణేకల్లు పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ టి.కేశవరెడ్డి, మండల జేసీఏ కన్వీనర్ హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు హర్ష తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ: రైతుల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రాకెట్ల, ఆమిద్యాల గ్రామాల్లోని ఆర్‌బీకేల వద్ద సబ్సిడీ పప్పుశనగ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌బీకెలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రబీ సీజన్‌లో జిల్లాలోనే అత్యధికంగా రైతులు ఉరవకొండలో పప్పుశనగ సాగుచేస్తారన్నారు. ప్రభుత్వం రైతులకు 40 శాతంతో విత్తనాలు అందిస్తోందన్నారు. గ్రామాల్లోనే రైతులకు ఆర్‌బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు, మందులు అందుబాటులోకి తీసుకురావడం గొప్ప విషయమన్నారు. అనంతరం రైతులకు పప్పుశనగ విత్తనాలను మాజీ ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో ఆత్మ డీడీఏ మద్దిలేటి, సర్పంచ్ శివమ్మ, ఎంపీపీ చంద్రమ్మ, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీవీ వీరన్న, పెన్నహోబిలం ఆలయ మాజీ చైర్మన్ అశోక్, కమ్మ, కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు తేజోనాథ్, గోవిందు, వెంకటేష్, మండల అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ వెంకటేష్, ఏఓ శుభకర్, మోపిడి, ఆమిద్యాల సర్పంచ్‌లు సిద్దార్థ్, శ్రీరాములు, కార్యదర్శి మహేష్, పార్టీ నాయకులు నాగరాజు, శ్రీనివాసులు, శీనానాయక్, రాజ్‌కుమార్, రామిరెడ్డి, రారాజు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరా లక్ష్యం


సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

కళ్యాణదుర్గం రూరల్: నిరంతర విద్యుత్ సరఫరా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ అన్నారు. మండలంలోని ఈస్ట్ కోడిపల్లిలో నూతనంగా నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు మంత్రి భూమి పూజ చేశారు. మంత్రి మాట్లాడుతూ రైతుల కరెంటు కష్టాలు తీర్చడం కోసం రూ.2.కోట్ల వ్యయంతో సబ్‌స్టేషన్ నిర్మిస్తామన్నారు. రైతుల కోసం జగనన్న ఎన్నో పథకాలకు అమలు చేశారన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర నిర్ణయించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కనీసం రోజుకు రెండు గంటలు కూడా కరెంటు సరఫరా అయ్యేది కాదన్నారు. చంద్రబాబు హయాంలో కరెంటు బిల్లు కట్టని వారిని అరెస్టు చేసిన రోజులను రైతులు ఇంకా మరిచిపోలేదన్నారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి సీఎం అయిన వెంటనే రైతులకు ఉచిత కరెంటు ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బొమ్మన్న, పార్టీ మండల కన్వీనర్ సర్వోత్తం, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ అఫ్జల్, జేసీఎస్ మండల కన్వీనర్ ఆంజనేయులు, నాయకులు కోడిపల్లి నాగరాజు, ఓబులేష్, నరేంద్రరెడ్డి, షేక్ష, లక్షన్న, వన్నూర్‌స్వామి, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

అతిపెద్ద ఆర్థిక ఉగ్రవాది చంద్రబాబు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: దేశంలోనే అతిపెద్ద ఆర్థిక ఉగ్రవాది టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు అని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ధ్వజమెత్తారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని పలు పథకాల్లో రూ.6 లక్షల కోట్లకుపైగా దోపిడీ చేసిన గజ దొంగ ఈ నారాసురుడని విరుచుకుపడ్డారు. శనివారం పట్టణంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇల్లూరి శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, పట్టణ కన్వీనర్ అరవ శివప్ప, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందుతో కలసి విప్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో కొల్లగొట్టిన రూ.371 కోట్లలో రూ.27 కోట్లు నేరుగా టీడీపీ బ్యాంకు ఖాతాకు చేర్చిన చీకటి కోణంపై సీఐడీ ఆధారాలతో బయటపెట్టిందన్నారు. నారా భువనేశ్వరి చూస్తే రూ.371 కోట్లు చిల్లర కాసు లాంటివంటారు..? అక్రమాలన్నీ తెలిసినా.. రాయదుర్గంలో ఉండే మురికి కాలువ చూస్తే కల్లుతాగిన కోతిలా నిత్యం సీఎం వైఎస్ జగన్, నా పైన గంతులేస్తున్నాడన్నారు. కాంగ్రెస్ హయాంలో చిదంబరం బూట్లు నాకి, సోనియా గాంధీ కాళ్లపై పడి, నీతిమాలిన కుట్రలు చేసిన నీచ బతుకులు మీవి కాదా..? అంటూ నిలదీశారు. అన్యాయంగా సీఎం జగన్‌ను 16 నెలల పాటు జైల్లో పెట్టించినా దుర్మార్గులు ఎవరో ప్రజలకు తెలిసే.. 2019 ఎన్నికల్లో రాష్ట్రానికి రాజును చేశారన్నారు. జగన్‌పై ఎన్ని కేసులు పెట్టినా దమ్మున్న మగాడిలా పోరాటం చేశారన్నారు. కానీ ఈ తెలుగు దొంగల డ్రామా చూస్తే ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. నాపై 26 ఎంక్వైరీలు వేశారు..? తమ్ముళ్లా.. ఏం పీక్కున్నారని ఇటీవల రాయదుర్గం పర్యటనలో చంద్రబాబుమాట్లాడారు. ఒక ఎంక్వైరీ వేస్తేనే సెంట్రల్ జైల్లో ఊచలు లెక్కిస్తున్నాడని, మిగిలిన కేసులపై విచారణ చేస్తే జైల్లో ఉండేందుకు జీవిత కాలం సరిపోదన్నారు. ఇక తుప్పునాయుడు(లోకేష్) చూస్తే కేసులు ఎక్కువ పెట్టించుకున్న వారికే పెద్ద పదవులు ఇస్తామంటూ ప్రజల్లో నవ్వులపాలయ్యాడన్నారు.

కాలవది శవాలపై కాసులు ఏరే నీచ బతుకు

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు శవాలపై కాసులు ఏరుకునేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రశాంతతకు మారుపేరుగా నిలిచిన రాయదుర్గంలో దోపిడీ దొంగ చంద్రబాబుకు మద్దతుగా దొంగ దీక్షలు చేస్తూ కులరాజకీయాలకు పాల్పడుతున్నాడన్నారు. నిరాహార దీక్షకు కూర్చోని పోలీసులను బతిమాలుకున్న దౌర్భాగ్యుడు మురికి కాలవ అన్నారు. కుల సంఘం ముసుగులో నలుగుర్ని వెంటేసుకుని రావడం.. వారంతా టీడీపీతోనే ఉన్నట్టు డ్రామాలాడటం కాలవకు వెన్నతోపెట్టిన విద్యగా మారిందన్నారు. వీరశైవ లింగాయత్, వాల్మీకి, కురుబ, యాదవ, నేసే, హరిజన, గిరిజన, ఇతర కులాలన్నీ వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచాయి కాబట్టే మూడు సార్లు ఎమ్మెల్యేగా నన్ను ఆశీర్వదించారని గుర్తుచేశారు. టీడీపీకి భవిష్యత్తు లేదన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ప్రజలు 175 స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీకి విజయం కట్టబెట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలీబాషా, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మేకల శ్రీనివాసులు, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్ గ్రామాల్లో ప్రత్యేక నిఘా


విడపనకల్లు: మాట్లాడుతున్న గుంతకల్లు డీఎస్పీ నరసింగప్ప

విడపనకల్లు/కళ్యాణదుర్గం: ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంటుందని గుంతకల్లు డీఎస్పీ నరసింగప్ప అన్నారు. విడపనకల్లు మండలంలోని హంచనహాళ్‌లో శనివారం ఉదయం 6 గంటల సమయంలో ఉరవకొండ రూరల్ సీఐ శేఖర్‌తో కలసి డీఎస్పీ కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. గ్రామంలో నిందితుల ఇళ్లు, రౌడీ షీటర్ల ఇళ్లు, అనుమానాస్పద ప్రదేశాలు, గడ్డివాములను సిబ్బందితో కలసి సోదాలు చేశారు. గ్రామంలో ఫ్యాక్షన్, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ తిప్పయ్య నాయక్, హెడ్‌కానిస్టేబుల్ దేవరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే కళ్యాణదుర్గం మండలంలోని గొల్ల గ్రామంలో శనివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అనుమానితుల ఇళ్లల్లో సోదాలు చేపట్టారు. కార్యక్రమంలో రూరల్ సీఐ శ్రీనివాసులు, రూరల్ ఎస్‌ఐ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్పర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం సెక్టార్ పరిధిలోని బ్రహ్మసముద్రం సెంటర్-1లో అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న సూచించారు. ఈ మేరకు శనివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి ఉత్తీర్ణత చెందడంతోపాటు బీసీ - బీ కులానికి చెందిన స్థానికులు అర్హులన్నారు. దరఖాస్తులను ఈ నెల 12లోపు అందజేయాలన్నారు.

అభ్యుదయ రైతులకు సన్మానం

ఉరవకొండ: ప్రయోగాత్మకంగా కే-1812 రకం వేరుశనగను సాగు చేసి విజయం సాధించిన రైతులను శనివారం ఉరవకొండ జైకిసాన్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. మండలంలోని ఆమిద్యాల, మోపిడి గ్రామాలకు చెందిన రైతులు వంకలో ఎర్రిస్వామి, గొర్ల ప్రకాష్‌లు చెరో ఐదెకరాల్లో పంటను సాగుచేశారు. రైతులనును ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగమల్లి ఓబుళేసు సన్మానించారు.

దుస్తుల దుకాణ యజమానికి మస్కా

ఉరవకొండ: ఓ వ్యక్తి దుస్తుల దుకాణ యజమానికి మస్కా కొట్టాడు. రూ. 55 వేలు చోరీ చేశాడు. అర్బన్ సీఐ హరినాథ్ వివరాల మేరకు.. స్థానిక గుంతకల్లు రోడ్డులో కేబీఎన్ కాటన్ సెంటర్ పేరిట అల్లాబకష్ దుస్తుల దుకాణం నిర్వహిస్తున్నాడు. శనివారం ఉదయం ఓ 40 ఏళ్ల వ్యక్తి వచ్చి రెండు జతల బట్టలు కొన్నాడు. ఈ క్రమంలో అల్లాబకష్‌ను మాటల్లో పెట్టి క్యాష్ బాక్స్‌లో ఉన్న రూ. 55 వేలు ఎత్తుకెళ్లాడు. కొంత సమయం తర్వాత ఈ విషయం గుర్తించిన అల్లాబకష్ చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నెలాఖరున సబ్ స్టేషన్ ప్రారంభిస్తాం


విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో డీఈ శ్రీకాంత్ రెడ్డి

కూడేరు: మండలంలోని పి.నారాయణపురం-తిమ్మాపురం గ్రామాల మధ్య రూ.3.5 కోట్లతో నిర్మిస్తున్న విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఈ నెలాఖరున ప్రారంభిస్తామని ట్రాన్స్ కో కన్‌స్ట్రక్షన్ డీఈ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన సబ్‌స్టేషన్‌ను సందర్శించి పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. 10 రోజులు తర్వాత టెస్టింగ్ చేస్తామన్నారు. లో ఓల్టేజీ సమస్యను అధిగమించేందుకే ఈ సబ్ స్టేషన్‌ను నిర్మిస్తున్నామన్నారు. సబ్‌స్టేషన్ ప్రారంభమైతే పి.నారాయణపురం, చోళసముద్రం, కరుట్లపల్లి, జయపురం తదితర గ్రామాల్లో బోర్లకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణరెడ్డి, ట్రాన్స్ కో ఏఈ గౌస్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, నేతలు శంకరయ్య, అక్కులన్న తదితరులు పాల్గొన్నారు.

నివాళి

గుమ్మఘట్ట: కలుగోడు గ్రామానికి చెందిన చాకలి రంగప్ప (56) శనివారం గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన రాయదుర్గం పట్టణంలోని మధు థియేటర్‌లో మేనేజర్‌గా పనిచేసేవాడు. అతనికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అండగా ఉంటామని కుటుంబానికి భరోసా కల్పించారు. జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, గార్మెంట్ నిర్వాహకులు చమ్మా ఇబ్రహీం, రవి, ప్రసాద్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు భరోసా 'ఆరోగ్య సురక్ష'


రాయదుర్గం రూరల్: ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి


కూడేరు: కొర్రకోడులో బాలామృతం కిట్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి


వజ్రకరూరు: కొనకొండ్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సతీమణి వై.ఉమాదేవి

రాయదుర్గం రూరల్: పేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న భరోసా కల్పిస్తూ ఆరోగ్య సురక్ష శకానికి నాంది పలికారని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డితో కలిసి మండలంలోని పల్లేపల్లిలో తహసీల్దార్ మారుతి టీం ఆధ్వర్యంలో సర్పంచ్ రాధమ్మ అధ్యక్షతన నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శనివారం విప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హెల్త్ క్యాంపుకు వచ్చిన వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మంచి చేసే పాలకులకు ప్రజలు సంపూర్ణ మద్దతు ప్రకటించాలన్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడే వారికి ప్రజలే బుద్ధి చెప్పాలన్నారు. శిబిరంలో మొత్తం 242కి వైద్య పరీక్షలు చేసి 14 మందిని రెఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు. అనంతరం వైద్యపరీక్షలు చేయించుకున్న వారికి ప్రభుత్వ విప్ ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నాగరాజరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు శంకర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, ఎంపీటీసీ రాజు, ఎంపీడీఓ కొండయ్య, ఏఓ చిక్కణ్ణ, పంచాయతీ కార్యదర్శి హేమంత్ రాజు, వైద్యులు రాజేంద్ర ప్రసాద్, మాధవ్ కుమార్ , ఓంకారయ్య, ఉదయ్ చంద్ర, మనోజ్ కుమార్ , ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది, అంగన్ వాడీ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

కణేకల్లు: పేద ప్రజల ప్రాణాలను కాపాడటమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని ఎన్.హనుమాపురం గ్రామంలో శనివారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' హెల్త్ క్యాంపును విప్ కాపు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటైన సభలో ఆయన మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేద ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ఆరోగ్యశ్రీని ప్రవేశపెట్టారన్నారు. ఆయన తనయుడు సీఎం జగన్ మరో అడుగు ముందుకేసి 'జగనన్న ఆరోగ్య సురక్ష'కు శ్రీకారం చుట్టారన్నారు. బాధితుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి ఎప్పటికప్పుడు వారికి మెరుగైన వైద్యసేవలందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకొంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, డాక్టర్లు రమేష్‌నాయక్, చంద్రమనోహర్, విజయకుమార్‌నాయక్, డిప్యూటీ తహసీల్దార్ రఘురామిరెడ్డి, ఈఓఆర్‌డీ గూడెన్న, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు నాగిరెడ్డి, కణేకల్లు పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ టి.కేశవరెడ్డి, సర్పంచులు ఫణీంద్రగౌడ్, భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్దదేవర నబీసా, హనుమంతరావు, గోపాల్, గోవర్ధన్‌రెడ్డి, హర్ష, మద్రేగౌడ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఆరోగ్య భరోసా

కూడేరు: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నారని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కొర్రకోడులో సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్ అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణను సీఎం జగన్ బాధ్యతగా తీసుకున్నారన్నారు. అనంతరం రోగులకు కేస్ షీట్లను, మెడికల్ కిట్లను అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను ఆయన పరిశీలించి గర్భిణులకు బాలామృతం కిట్లను పంపిణీ చేశారు. శిబిరంలో సుమారు 400 మంది వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు శివలాల్‌రెడ్డి, ఎంపీపీ నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ దేవా, సింగిల్‌విండో ప్రెసిడెంట్ గంగాధర్, స్పెషలాఫీసర్ సత్యనారాయణ, తహసీల్దార్ శేషారెడ్డి, ఎంపీడీఓ ఎంకే బాషా, వైద్యులు సరిత, లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి. వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీవీ వీరన్న, మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, నేతలు వెంకటరామిరెడ్డి, ప్రభాకర్, చౌడప్ప, బచ్చలయ్య, వెంకటేష్, వైద్య , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష' బృహత్తర కార్యక్రమం

వజ్రకరూరు/రాయదుర్గం/విడపనకల్లు/బ్రహ్మసముద్రం: 'జగనన్న ఆరోగ్య సురక్ష' బృహత్తర కార్యక్రమమని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సతీమణి వై.ఉమాదేవి అన్నారు. శనివారం మండలంలోని కొనకొండ్ల ప్రాథమిక పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచు నంచర్ల ఇందిరమ్మ, ఎంపీటీసీలు పాపన్న, మునయ్య, ముద్దయ్య, మాజీ ఎంపీపీ రామచంద్ర, మాజీ ఉపసర్పంచు గురు, మండల స్పెషలాఫీసర్ ఆదిశేషానాయుడు, పార్టీ నాయకులు నంచర్ల లాలెప్ప , వైద్యాధికారులు గంగాధర్, తేజశ్వి, మారుతీప్రసాద్, గ్రామ కార్యదర్శి శ్రీధర్‌రావు, సూపర్‌వైజర్లు పద్మావతి, పద్మ, తదితరులు పాల్గొన్నారు. అలాగే డి హీరేహాళ్ మండలంలోని మలపనగుడిలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్, పార్టీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు రాళ్ల తిమ్మారెడ్డి, సర్పంచ్ రుద్రేష్, ఎంపీడీఓ భాస్కర్‌బాబు, డిప్యూటీ తహసీల్దార్ బసవకుమార్, డాక్టర్ శ్రావణ్‌కుమార్, సర్పంచ్ మల్లికార్జున, మైనార్టీ నాయకుడు రహంతుల్లా, మాజీ ఎంపీటీసీ గవిసిద్ధ, నాయకులు గోవర్ధన్, నారాయణ, దేవన్న, రవిగౌడ, సింగాడి జగదీష్, మంజు, ఖాసీం పీరా పాల్గొన్నారు. విడపనకల్లు మండలం గడేకల్లు సచివాలయం-2 పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎంపీపీ విద్యావతి, సర్పంచు సుశీల , ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దారు ఈరమ్మ, ఈఓఆర్డీ సత్యబాబు, ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఉమారాణి, ఎంపీటీసీ ఓబుళేసు, మాజీ సర్పంచు కరణం భీంరెడ్డి, నాయకులు ఉమాశంకర్, సురేష్‌యాదవ్, ప్రసాదు, హంపయ్య, వైద్యులు ప్రతిమ, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మసముద్రం మండంలోని ఎస్ కొండాపురంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ దాసానాయక్, తహసీల్దార్ బాలకిషన్, ఎంఈఓ ఓబుళపతి, పార్టీ మండల కన్వీనర్ బసవరాజు, సర్పంచ్ వనిత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కాసింబీ పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' పేదలకు వరం

రాయదుర్గంటౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సచివాలయ అడ్మిన్‌లు, ఏఎన్‌ఎంలు, వలంటీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించాలన్నారు. ఈనెల 17, 18 తేదీల్లో జరిగే వైద్య శిబిరానికి సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించాలని, ఆలోగా అవసరమైన వారికి ఇంటి వద్దనే ర్యాండమ్ పరీక్షలు చేసి టోకన్లు జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ అజార్‌ఖాన్, వార్డు కౌన్సిలర్ గోవిందరాజులు, వార్డు ఇన్‌చార్జ్ దివాకర్ పాల్గొన్నారు.

ప్రయాణికులకు శుభవార్త

కళ్యాణదుర్గం రూరల్: ప్రయాణికులకు ఆర్టీసీ శుభవార్త తెలిపింది. డిపో మేనేజర్ రామచంద్ర శనివారం విలేకరులతో మాట్లాడారు. కళ్యాణదుర్గం నుంచి అనంతపురం ప్రయాణించే వారు బస్ దిగేముందు టికెట్ వెనుక ఫోన్ నంబర్, అడ్రస్ రాసి బస్సులో ఉంచిన గిఫ్ట్ బాక్స్‌లో వేయాలన్నారు. 16వ తేదీ లాటరీ ద్వారా విజేతలను ప్రకటించి, బహుమతులు అందజేస్తామన్నారు. అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవలన్నారు.

ఘనంగా వన్య ప్రాణుల వారోత్సవాలు

బ్రహ్మసముద్రం: మండలంలోని పిల్లలపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం అటవీ శాఖ అధికారుల ఆధ్వర్యంలో వన్యప్రాణుల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వన్య ప్రాణులపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు షానవాజ్, సుబ్రమణ్యం , పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
రాయదుర్గం డివిజన్
9010470185, 9010006852, 9010223701